ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల జిల్లా వార్తలు
5★★★
ఆదివారం 5 అక్టోబరు 2025



సమస్యల పరిష్కారానికి కృషి..

- సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటేశ్వర్లు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : వయోవృద్ధులు పిల్లలు ఆదరించక పోతే అర్జీలు పెట్టుకుంటే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్, గీత ప్రచార సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం, దసరా ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్డీవో వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ముందుగా ఆర్డీవో వెంకటేశ్వర్లును తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్, గీత ప్రచార సేవా సమితి సభ్యులు శాలువలతో సన్మానించారు. అనంతరం ఆర్డీవో తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్, గీత ప్రచార సేవా సమితి సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లు, వయోవృద్ధులను వారి పిల్లలు ఇబ్బందులకు గురిచేస్తే తమకు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్, గీత ప్రచార సేవా సమితి, చిన్మయ మిషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం అందజేశారు. గ్రామంలోని పుష్పలతకు రూ.28 వేలు, సావిత్రికి రూ.50వేలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సాహెబ్, శ్రీనివాస్‌రెడ్డి, సాయిప్రేమ్, రాజిరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయదశమి పురస్కారం అందజేత



పాకాల శంకర్‌గౌడ్

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాకాల శంకర్‌గౌడ్‌కు విజయదశమి పురస్కారం అందుకున్నారు. శనివారం హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్‌లో విజయ దశమి పురస్కారాలు సాహితీ కళా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు స్వప్నకిషోర్ చేతుల మీదుగా శంకర్‌గౌడ్ పురస్కారాన్ని అందుకున్నారు. శంకర్‌గౌడ్‌కు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్, ప్రధాన కార్యదర్శి రాజు, ప్రధానోపాధ్యాయుడు మోతిలాల్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. సిరిసిల్ల పట్టణం కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్‌అసిస్టెంట్‌గా భౌతకశాస్త్రంలో విద్యార్థులకు శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించడంలో శంకర్‌గౌడ్ కృషిని గుర్తించి పురస్కారానికి ఎంపిక చేశారు.

కృష్ణా నదిలో దుర్గామాత నిమజ్జనం



కృష్ణానదిలో దుర్గామాతను నిమజ్జనం చేస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని దుర్గ భవాని సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గా మాతను తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధల నడుమ కొలిచారు. అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి శోభాయాత్ర నిర్వహించారు. శుక్రవారం రాత్రి గ్రామ వీధుల గుండా దర్శనమిచ్చిన అమ్మవారిని విజయవాడలో కనక దుర్గామాత ఆలయం సమీపంలోని కృష్ణానదికి తరలించారు. శనివారం ఉదయం నిమజ్జన వేడుకలను నిర్వహించామని దుర్గా భవాని సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు.

హైకోర్టు తీర్పుపై ఉత్కంఠ



- జీవో 9కి అనుకూలమా..? వ్యతిరేకమా?
- జిల్లా రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చలు
- రిజర్వేషన్లు తారుమారుపై ఆందోళన
- అభ్యర్థుల ఎంపికపై పార్టీల కసరత్తు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పల్లె ఎన్నికల పండుగ వచ్చినా రిజర్వేషన్ల టెన్షన్ మాత్రం ఆశావహులకు వీడటం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 జడ్పీటీసీ స్థానాలు, 123 ఎంపీటీసీ స్థానాలు, 260సర్పంచ్, 2268 వార్డు సభ్యుల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లు, 2024 కులగణనతో జీవో 9 ద్వారా బీసీ రిజర్వేషన్లను ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టులో వేసిన రిట్‌పై ఈనెల 8న తీర్పు రాబోతోంది. జీవో 9 రిజర్వేషన్లకు అనుకూలమా, వ్యతిరేకమా అనే దానిపై రాజన్న సిరిసిల్ల జిల్లా లోని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

మరో వైపు అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తుండగా, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్ అభ్యర్థులను ఖరారు చేసే పనిలో పడ్డారు. ఇప్పటికే పార్టీలో సర్వేలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు హైకోర్టు జడ్పీటీసీ, ఎంపీటీసీ సర్పంచ్ ఎన్నికలను వాయిదా వేస్తుందనే ఆందోళన కూడా పోటీకి సిద్ధమైన వారిలో ఉంది.

రిజర్వేషన్ మారితే..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో స్థానిక ఎన్నికల వేడి గ్రామాల్లో మొదలైనప్పటికీ బీసీలకు 45 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో 9ని హైకోర్టు నిలుపుదల చేస్తే రిజర్వేషన్లు మారే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం డబ్బులు ఖర్చు చేస్తూ ముందుకు వెళితే తీరా రిజర్వేషన్లు మారితే పరిస్థితి ఏమిటనే సందిగ్ధంలో ఆశావహులు ఉన్నారు. ఇప్పటికే 12 జడ్పీటీసీ స్థానాల్లో ఎస్టీలకు ఒకటి, ఎస్సీలకు మూడు, బీసీలకు ఐదు, జనరల్ మూడు స్థానాలను కేటాయించారు. జడ్పీ చైర్మన్ ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ చేశారు. 123 ఎంపీటీసీ స్థానాల్లో ఎస్టీలకు 7, ఎస్సీలకు 25, బీసీలకు 56, జనరల్ 35 స్థానాలను కేటాయించారు. ఎంపీపీల రిజర్వేషన్లలో రుద్రంగి ఎస్టీ జనరల్, ముస్తాబాద్ ఎస్సీ మహిళ, కోనరావుపేట ఎస్సీ జనరల్, వేములవాడ రూరల్ ఎస్సీ జనరల్, ఇల్లం తకుంట బీసీ మహిళ, బోయినపల్లి బీసీ మహిళ, గంభీరావుపేట, వేములవాడ అర్బన్, ఎల్లా రెడ్డిపేట బీసీ జనరల్, వీర్నపల్లి మహిళా జనరల్, చందుర్తి, తంగళ్లపల్లి జనరల్ రిజర్వ్ చేశారు. 260 సర్పంచ్ స్థానాల్లో ఎస్టీలకు 30, ఎస్సీలకు 53, బీసీలకు 101, జనరల్ 76 స్థానాలను కేటాయించారు. ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం ముందుకు వెళ్లని అనిశ్చిత పరిస్థితి ఆశవహుల్లో ఏర్పడింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో అందరి చూపు అక్టోబరు 8న హైకోర్టు ఇచ్చే తీర్పుపైనే ఉంది. మరోవైపు రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వచ్చిన ప్రాంతాల్లో కొందరు ఎన్నికల బరిలో నిలిచేందుకు సన్నాహాలు ప్రారంభించిన మరికొందరు కోర్టు తీర్పువచ్చిన తర్వాతనే ముందుకు సాగాలని భావిస్తున్నారు.



రాజన్న ఆలయం మూసివేతకు వ్యతిరేకం..

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

వేములవాడ రూరల్, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధికి బీజేపీ అడ్డంకులు సృష్టించదని, అభివృద్ధి పేరిట రాజన్న ఆలయాన్ని మూసివేతను మాత్రమే తాము వ్యతిరేకిస్తున్నామని పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. వేములవాడ బీజేపీ రూరల్ మండల కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ అభివృద్ధి పేరిట రాజన్న ఆలయాన్ని మూసివేయడంపై బీజేపీ పక్షాన వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆగమన శాస్త్రం ప్రకారం దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధిని భారతీయ జనతా పార్టీ స్వాగతిస్తోందన్నారు. అభివృద్ధి పేరిట ఆలయాన్ని మూసివేసి భక్తులకు రాజన్ననే దూరం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. రాజన్న ఆలయం మూసివేసి హిందు వుల మనోభావాలను దెబ్బతీసేందుకు పెద్దఎత్తున కుట్ర జరుగుతోం దని పాలకపక్షంతీరును ఆయన దుయ్యబట్టారు. ఆలయాన్ని మూసి వేస్తే సహించేది లేదన్నారు. అభివృద్ధిలో భాగంగా ఆలయ ప్రధాన రహదారి విస్తరణ తప్పని తరుణంలో తాము స్వాగతించామన్నారు. కానీ ఆలయ అభివృద్ధి పేరిట హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరకోబోమన్నారు. కేంద్రంలో భార తీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాశీ విశ్వనాథుడి ఆలయాన్ని, ఉజ్జయనీ మహంకాళి ఆలయాన్ని వందల కోట్లతో అబి వృద్ధి చేశామన్నారు. ఆయా ఆలయాల పునర్నిర్మాణంలో అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు ఎక్కడా ఆలయాలు మూసివేయడం జరగ లేదన్నారు. కానీ ఇక్కడ భిన్నంగా ఆలయ అభివృద్ధి పేరిట రాజరాజే శ్వర స్వామివారి క్షేత్రాన్ని మూసివేసి భక్తులకు రాజన్నను ఎందుకు దూరం చేస్తున్నారన్నారు. రాజన్న ఆలయం మూసివేసి భక్తులకు భీమేశ్వరాలయంలో దర్శన సౌకర్యాలను కల్పించడమేంటని ఆయన ప్రశ్నించారు. భక్తులు రాజన్న మొక్కులు భీమన్నకు ఎలా సమర్పి స్తారని బీజేపీ సీనియర్ నాయకుడు ప్రతాప రామకృష్ణ పదే పదే ప్రశ్నించిన విషయాన్ని గుర్తుచేశారు. రాజన్న ఆలయంలో దర్గాను వేరే చోటికి తరలించాలన్నారు. సమ్మక్క, సారలమ్మ ఆలయాలను అభివృద్ధి చేస్తామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం సమ్మక్క, సారాలమ్మ జాతరకు వెళ్లే ముందు భక్తులు రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని తెలియదా అని ప్రశ్నించారు. రాజన్న ఆలయ మూసివేతకు బీజేపీ పూర్తిగా వ్యతిరేకమన్నారు. బీజేపీ ఆలయాల అభివృద్ధిని స్వాగతిస్తుందన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించకుండా అభివృద్ధి పనులు చేయాలన్నారు. ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ రాజన్న ఆలయాన్ని అభివృద్ధిపేరిట మూసివేయడానికి పూనుకుంటే రాజన్న భక్తులు, వేలాదిమంది హిందువులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు పొన్నాల తిరుపతి రెడ్డి, సిరికొండ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు బండ మల్లేశం, కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, రూరల్ మండల అధ్యక్షుడు బురుగుపల్లి పరమేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రత్యేక తనిఖీలు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఈనెల 6 సోమవారం నుంచి జిల్లాలో వాహనాల ప్రత్యేక తనిఖీలు నిర్వహి స్తామని ఒక ప్రకటనలో జిల్లా రవాణా శాఖ ఇన్‌చార్జి అధికారి వంశీధర్ తెలిపారు. జిల్లా పరిధిలో సరుకులు, ప్రయాణీకులను చేరవేసే వాహనాలకు సంబంధించి 4419 వాహనాల యజమానులు టాక్స్ చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. జిల్లాలో రోడ్డు టాక్స్ చెల్లించకుండా వాహనాలను వినియోగిస్తు న్నారని పేర్కొన్నారు. సిరిసిల్ల డివిజన్ పరిధిలో 2,787, వేములవాడ డివిజన్ పరిధిలో 1,632 వాహనాలు టాక్సీలు చెల్లించకుండా వాహనాలను నడుపు తున్నారని తెలిపారు. మరికొన్ని వాహనాలు ఫిట్‌నెస్ లేకుండా జిల్లాలో 11,425 వాహనాలు తిరుగుతున్నాయని, అందులో సిరిసిల్ల డివిజన్ పరిధిలో 6,647, వేములవాడ డివిజన్ పరిధిలో 4,778 వాహనాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా వాహనాల యజమానులు వాహనాల ట్యాక్సీలు చెల్లించి, ఫిట్‌నెస్ చేయించుకోవాలని సూచించారు. ఈనెల 6 నుంచి జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ట్యాక్సీ, ఫిట్‌నెస్ లేని వాహనాలపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

డీఎస్పీగా ఎంపికైన యువకుడికి సన్మానం



శివకుమార్‌ను సన్మానిస్తున్న మున్నూరుకాపు సంఘ నాయకులు

ఇల్లంతకుంట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గ్రూపు 1ఫలితాలలో డీఎస్పీగా ఎన్నికైన కందికట్కూర్ గ్రామానికి చెందిన బత్తుల శివకుమార్‌ను మున్నూరుకాపు సంఘ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామంలోని సంఘభవనంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన శివకుమార్ యువతకు ఆదర్శంగా నిలిచాడన్నారు. చదువుపై దృష్టి నిలిపితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని, విద్యావంతులకు సమాజంలో మంచి గౌరవం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండల మున్నూరుకాపు సంఘ అధ్యక్షుడు యాస తిరుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు ఈర్ల కిష్టయ్య, నాయకులు బత్తుల స్వామి, సిద్ధం కరుణాకర్, బత్తుల జోగయ్య, బత్తుల మోహన్, చదువాల సుధాకర్, పోతరాజు కనుకయ్య, సత్తయ్య, మల్లేశం, తిరుపతిలతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

శ్రామిక మహిళల శ్రమను గౌరవించాలి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : శ్రామిక మహిళల శ్రమను గౌరవించాలని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ సూరం పద్మ అన్నారు. శనివారం జిల్లా కేంద్రం బీవైనగర్ అమృత్‌లాల్ శుక్ల కార్మిక భవనంలో జరిగిన జిల్లా శ్రామిక మహిళా సమన్వయ కమిటి సమావేశంలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మహిళలతో పాటు శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆర్థిక, సామాజిక అణచివేత, పని భద్రత, వేతనాలు లేని శ్రమ తదితర సమస్యలపై శ్రామిక మహిళ సమన్వయ కమిటీ(సీఐటీయూ) నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. శ్రామిక మహిళల సమస్యల పరిష్కరించుకోవడం, వారి హక్కులను కాపాడుకోవడం, భవిష్యత్తు ఉద్యమ పోరాట కార్యక్రమాలను రూపొందించుకోవడం కోసం శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సమన్వయ కమిటీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, కార్యదర్శి కోడం రమణ, నాయకులు సందుపట్ల పోచమల్లు, లలిత, ఇందిరా, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

మారనున్న రాజన్న ఆలయ ముఖచిత్రం

- శరవేగంగా విస్తరణ పనులు



భీమేశ్వర ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు 7

చెరువులకు జలకళ..

- మత్తడి దూకుతున్న సాగునీటి వనరులు



మత్తడి దూకుతున్న గిద్దె చెరువు 8



బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు

రుద్రంగిలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



బతుకమ్మతో యువతి..

రుద్రంగి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయానికి ప్రతీరూపమైన బతుకమ్మ వేడుకలు శనివారం రుద్రంగి మండల కేంద్రంలో కన్నుల పండువగా జరిగాయి. రుద్రంగిలో దసరా అనంతరం బతుకమ్మ వేడుకలు జరగడం ఆనవాయితీగా వస్తోంది. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ప్రధాన కూడళ్లలో ఉంచి మహిళలు కోలాటలు ఆడారు. అనంతరం గ్రామ శివారులోని బతుకమ్మ చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

పూలను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణది..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

పూలను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ రాష్ట్రానిదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో శనివారం జరిగిన బతుకమ్మ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టి గ్రామశాఖ అధ్యక్షులు సామ మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, కేసిరెడ్డి నర్సరెడ్డి, కొమిరె శంకర్, పల్లి గంగాధర్, తర్రె లింగం, ఇప్ప మహేష్, బొల్లి దేవేందర్, ఎర్రం రాజలింగం, మాడిశేట్టి అలాష్, ఆకుల గగన్, పూదరి మహిపాల్, ఎర్రం అరవింద్, చెలుకల శ్రీకాంత్, రాహుల్, సూర యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ చెరువు వద్ద సందడి..





చివరి మజిలీకి అవస్థలు

పదిరలో కొట్టుకుపోయిన శ్మశాన వాటిక

- కొట్టుకుపోయిన వైకుంఠధామాలు
- అంత్యక్రియలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీవితం ఉన్నంత కాలం ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న మనిషికి అఖరి మజిలీలోనూ అవస్థలు తప్పడం లేవు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం నిర్మించిన శ్మశానవాటికల్లో సమస్యలు ఘోషిస్తున్నాయి. అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీస వసతులు లేక అతికష్టం మీద ముగిస్తున్నారు. పలు గ్రామాల్లోని శ్మశానవాటికలను వాగు సమీపంలో నిర్మించడం వల్ల మూడేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయాయి. గ్రామాలకు దూరంగా ఉండడంతో నిరుపయోగంగా మారాయి. ఉన్న కొన్ని శ్మశానవాటికల్లో వసతులు కరవయ్యాయి.

● వినియోగంలోకి రాకముందే..

మండల కేంద్రంతో పాటు పదిర, రాగట్లపల్లి, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, రాచర్లతిమ్మాపూర్, అల్మాస్‌పూర్, దుమాల, అక్కపల్లి, తదితర గ్రామాల్లో సుమారు 30 స్మశాన వాటికలను ప్రభుత్వం నిర్మించింది. రాగట్లపల్లి, పదిరగ్రామాల్లో వాగు, ఒర్రె సమీపంలో పనులు చేపట్టడం వల్ల వినియోగంలోని రాక ముందే కొట్టుకుపోయాయి. దాంతో ఆ గ్రామాల ప్ర జలు ఎవరైనా చనిపోతే వాగు ఒడ్డుకు అంత్యక్రియా లు నిర్వహించాల్సి వస్తోంది. కొందరు వ్యవసాయ పొలాల వెంట పరుగులు తీయాల్సి వస్తోంది.

● సమస్యల తిష్ఠ

మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, అల్మాస్‌పూర్, దుమాల, అక్కపల్లి, కోరుట్లపేట, రాచర్లతిమ్మాపూర్, బాకురుపల్లితండా, గుంటపల్లిచెరువుతండా తదితర గ్రామాల్లో సుమారు కిలోమీటరు నుంచి 3 కిలోమీటర్ల దూరంలో శ్మశాన వాటికలను నిర్మించారు. కనీస వసతులను మర్చిపోయారు. విద్యుత్తు, నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. చీకట్లో అంత్యక్రియాలు నిర్వహించేందుకు కరెంటు సౌకర్యం లేక సెల్‌ఫోన్ టార్చ్‌లైటు వెలుతురులో ఇబ్బందులు పడుతున్నారు. స్నానాలు చేసేందుకు ట్యాంకర్లకు స్వంత డబ్బులను వెచ్చించాల్సి వస్తోంది. గ్రామాల్లో నిర్మించిన శ్మశానవాటికల్లో వసతులు కల్పించడంతో పాటు కొట్టుకుపోయిన వాటిని తిరిగి నిర్మించి ఆఖరి మజిలీ అవస్థలను తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రాగట్లపల్లిలో ధ్వంసమైన గదులు

ఇబ్బందులు తప్పడం లేదు

- బొల్లి ఎల్లయ్య, పదిర, ఎల్లారెడ్డిపేట



మా ఊరి చివరన ఉన్న చిటివాగు వద్ద స్మశాన వాటికలను నిర్మించారు. వానకు వాగు వచ్చి కొట్టుకుపోయింది. ఎవరైనా చనిపోతే వాగు ఒడ్డుకు నిర్వహిస్తున్నాం. శ్మశానవాటిక కట్టినా ఉపయోగం లేకుండాపోయింది. సార్లు పట్టించుకుని ఇబ్బందులు లేకుండా శ్మశానవాటికలను నిర్మించాలి.

సౌకర్యాలు కల్పించి సమస్యలను తీర్చుతాం..

- సత్తయ్య, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట



మండలంలోని పలు గ్రామాల్లోని శ్మశానవాటికలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశిస్తాం. సమస్యలను గుర్తించి నివేదికలను సమర్పించాలని సూచిస్తాం. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా శ్మశానవాటికల్లో సౌకర్యాలు కల్పించి సమస్యలను తీర్చుతాం.

మళ్లీ.. గేటు పడితే ఎలా?



రైల్వే గేటు కింది నుంచి వస్తున్న వాహనదారులు

గంగాధర, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై మంగపేట సమీపంలోని రైల్వేగేటు ఈ వారంలో ఇప్పటికే మూడుసార్లు మొరాయించింది. దీంతో ఇరువైపులా కిలోమీటర్ మేర భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. శనివారం రైలు వస్తుందనగా అధికారులు రైల్వే గేటు వేశారు. రైలు వెళ్లగానే ద్విచక్రవాహనదారులు గేటు మళ్లీ మొరాయిస్తే ఆలస్యమవుతుందని తలచి తమ వాహనాలను ఒకవైపు వంచి గేటు దాటారు. దీన్ని గమనించిన తోటి వాహనదారులు పది నిముషాలు గేటు తెరచే వరకు ఆగలేరా అంటూ వారిని ప్రశ్నించారు. ఇప్పటికే మూడు మార్లు గేటు మొరాయించిందని, సాంకేతిక లోపం ఏర్పడి మళ్లీ గేటు ఎత్తకపోతే ఆఫీసుకు ఆలస్యమవుతుందని చెప్పుకుంటూ వెళ్లారు.

కేసు నమోదు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కాపువాడలో బీజేపీ నాయకుడు ఆవుదుర్తి శ్రీనివాస్ ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా, దానిని శుక్రవారం కొందరు వ్యక్తులు చింపి వేశారనే ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఫ్లెక్సీ చింపివేసిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

లారీ చోరీ కేసులో నాలుగు నెలల జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): లారీ దొంగతనం కేసులో నిందితుడు సయ్యద్ అలీకి కరీంనగర్ కోర్టు నాలుగు నెలల జైలుశిక్ష, 300 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిందని కొత్తపల్లి పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రాజుకు చెందిన లారీని జనవరి 29న ఉత్తరప్రదేశ్‌కు చెందిన సయ్యద్ అలీ దొంగిలించాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, లారీని స్వాధీనం చేసుకోవటంతో పాటు నిందితుడి అరెస్టు, బలమైన సాక్షుల వాంగ్మూలాలను కోర్టులో సమర్పించినట్లు తెలిపారు. నిందితుడికి శిక్షపడటంలో కీలకంగా పనిచేసిన సీఐ ప్రదీప్‌కుమార్, ఎస్‌ఐ సాంబమూర్తి, కోర్టు కానిస్టేబుల్ మౌనికలను పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం అభినందించారు.

అతిగా మద్యం తాగి యువకుడి మృతి



కోడూరి రాజేశం(ఫైల్)

ఎలిగేడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కోడూరి రాజేశం(35) అనే యువకుడు అతిగా మద్యం తాగి మృతిచెందినట్లు ఏఎస్సై రామచంద్రం తెలిపారు. ఆయన కథనం మేరకు.. రాజేశంనకు ఏడాది క్రితం సౌందర్యతో వివాహం జరిగింది. భార్యాభర్తలు ఇద్దరు కరీంనగర్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మద్యానికి బానిసగా మారిన రాజేశం, నిత్యం మద్యం సేవిస్తూ ఇష్టారీతిన ప్రవర్తించేవాడు. దసరాకు ఎలిగేడు వచ్చాడు. శుక్రవారం రాత్రి 10 గంటలకు మద్యం తాగడానికి బయటకు వెళ్లగా, శనివారం ఉదయం వరకు కూడా ఇంటికి రాలేదు. చుట్టుపక్కల వెతకగా ప్రభుత్వ ఉన్ని కేంద్రంలో మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. ఈమేరకు మృతుడు రాజేశం భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన బాలుడి మృతి

ఎన్‌టిపిసి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజుల క్రితం ఎన్టీపీసీ క్రషర్ నగర్‌లో జరిగిన విద్యుత్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సద్దాల గణేష్(16) అనే బాలుడు కరీంనగర్‌లో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. విద్యుత్ లైన్లను సవరిస్తుండగా జరిగిన ప్రమాదంలో ముగ్గురు మైనర్లు గాయపడిన విషయం తెలిసిందే. తీవ్రంగా కాలిన గాయాల పాలైన గణేష్‌ను మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎన్టీపీసీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గంభీరావుపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కోళ్లమద్ది గ్రామ సమీపాన అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. కోళ్లమద్దికి చెందిన మధుసూదన్ అనే వ్యక్తి మానేరు వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను ట్రాక్టర్‌లో నింపుకుని అధిక ధరలకు విక్రయిస్తుండగా పట్టుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్‌చేసి, అక్రమంగా ఇసుక తరలించిన వ్యక్తిని రిమాండ్‌ను తరలించినట్టు ఎస్‌ఐ అనిల్‌కుమార్ వివరించారు.

ధాన్యం రాశులను ఢీకొన్న ద్విచక్ర వాహనం.. ఒకరికి గాయాలు

చందుర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రం శివారులో ద్విచక్ర వాహనదారుడు ధాన్యం రాశులను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. చందుర్తి నుంచి మోత్కరావుపేట వెళ్లే రోడ్డు మార్గంలో ఓ రైతు ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టాడు. మండల కేంద్రానికి చెందిన రాపల్లి మొండయ్య అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ధాన్యం రాశులను ఢీకొని కింద పడిపోయాడు. దీంతో గాయపడ్డ మొండయ్యను చికిత్స నిమిత్తం స్థానికంగా ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రోడ్లపై రైతులు ధాన్యం ఆరబెడుతున్నందున వాహనదారులు జాగ్రత్త వెళ్లాలని మండల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంటయ్య కోరారు.

ఖనిలో యువకులపై దాడి

కోల్‌సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని అశోక్‌నగర్‌లో ఇద్దరు యువకులపై ముగ్గురు యువకులు దాడికి పాల్పడిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. అశోక్‌నగర్‌లోని ఒక రెడిమేడ్ షాపు వద్దకు తిలక్‌నగర్‌కు చెందిన అరవింద్ తనమిత్రులతో కలిసి వచ్చాడు.

షాపు మూసి ఉండడంతో బోర్డుపై ఉన్న సెల్‌నంబర్‌కు ఫోన్‌చేస్తుండగా అశోక్‌నగర్‌కు చెందిన కార్తీక్, గుండుంబ సందీప్‌తోపాటు మరో యువకుడు అరవింద్ స్నేహితులతో గొడవకు దిగి రాళ్లతో దాడి చేసుకున్నారు. దీంతో అరవింద్ కనుబొమ్మకు గాయం కాగా గోదావరిఖని ప్రభుత్వజనరల్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. దీనిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకులకు గంజాయి నిర్ధారణ పరీక్షలు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామ శివారులో గంజాయి తాగుతున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించామని పోలీసులు శనివారం తెలిపారు. ఐదుగురు మద్యం తాగుతూ పట్టుబడ్డారని పేర్కొన్నారు. ఐదుగురు యువకులకు గంజాయి నిర్ధారణ పరీక్షలు జరిపామని చెప్పారు. అవగాహన కల్పించామని తెలిపారు. గంజాయి రవాణా, అమ్మకాలు, తాగుతున్న యువకుల కదిలికలపై నిఘా ఉంచామని పోలీసులు వివరించారు.

గీత కార్మికుడికి గాయాలు

రామగిరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామంలో ఈత చెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బిటుకు కొమురయ్యగౌడ్ ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు నిచ్చెన జారి పోవడంతో చెట్టు పైనుంచి కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన కొమురయ్యను పెద్దపల్లికి తరలించారు. కొమురయ్య గౌడ్‌ని ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు కోరారు.

రహదారిపై కొండ చిలువ ప్రత్యక్షం



రోడ్డు పైనుంచి వెళుతున్న కొండ చిలువ

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని మానేరు వాగు వంతెన వద్ద రహదారిపై శనివారం రాత్రి కొండచిలువ ప్రత్యక్షమైంది. రోడ్డు వెంట వెళుతున్న వాహనదారులు గమనించి భయాందోళనకు గురయ్యారు. చంపేందుకు ప్రయత్నించడంతో కొండచిలువ వేగంగా రోడ్డు దాటి పక్కన ఉన్న పొదల్లోకి వెళ్లిపోయింది. ఇటీవల కొండచిలువలు రోడ్లపైకి వస్తుండడం వల్ల ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు.

బస్సు వెనక బస్సు.. ప్రయాణికులకు తిప్పలు

సమయపాలన పాటించని అధికారులు



వేములవాడ వైపు ఒకదానివెనకాల ఒకటి వెళ్తున్న బస్సులు

కొడిమ్యాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండల కేంద్రం మీదుగా జగిత్యాలకు నడిచే వేములవాడ డిపో బస్సులు ఒకదాని వెనక ఒకటి ఒకే వైపు నడుస్తుండటంతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. ఈ రూట్‌లో ఆర్టీసీ సౌకర్యం ప్రయాణికులకు అనుకూలంగా ఉన్నది. కొద్ది రోజులుగా బస్సు వెనుక బస్సు రావటంతో ప్రయాణికులు బస్సు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. మండల కేంద్రమైన కొడిమ్యాల నుంచి ఆర్టీసీ బస్సు జగిత్యాల వైపునకు, వేములవాడ వైపునకు వెళ్లిన ఒక బస్సు వెనుక ఒక బస్సు వెళ్లటంతో ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిపో నుంచి బయలుదేరుతున్న బస్సులు సమయ పాలన పాటిస్తే ప్రయాణికులకు ఎదురు చూపులు ఉండవని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఆర్టీసీ అధికారులు నిర్ణయించిన సమయానికి బస్సులు నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అన్నపై తమ్ముళ్ల హత్యాయత్నం



గాయపడిన కొమురయ్య

మానకొండూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వన్నారం గ్రామపంచాయతీ శివారు గ్రామమైన కొత్తపల్లికి చెందిన బోయిని కొమురయ్య అనే వ్యక్తిపై అతని తమ్ముళ్లు బోయిని ఆంజనేయులు, బోయిని లక్ష్మణ్‌లు పదునైన ఇనుప రాడ్డుతో శనివారం దాడికి పాల్పడ్డారు. స్థానిక సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లికి చెందిన కొమురయ్యకు ఇద్దరు అన్నలు ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. కొమురయ్యకు ఆంజనేయులు, లక్ష్మణ్‌ల మధ్య భూతగాద నడుస్తోంది.

శనివారం ఉదయం కొమురయ్య పొలం వద్ద పాలను పితకడానికి వెళ్తుండగా ఆంజనేయులు, లక్ష్మణ్‌లు పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని కాపు కాసి పదునైన ఇనుపరాడ్డుతో వీపుపై దాడి చేశారు. తీవ్ర గాయాలతో వారి బారి నుంచి కొమురయ్య తప్పించుకొని ఇంటికి రావడంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం 108 ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు కొము రయ్య భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మానకొండూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని తూర్పుదర్వాజ బస్టాండ్ మూలమలుపు వద్ద 20 ఏళ్ల క్రితం విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కరీంనగర్ నుంచి జమ్మికుంట ప్రధాన రహదారి మానకొండూర్ తూర్పుదర్వాజ బస్టాండ్ మీదుగా ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర వాహనాలు ప్రతీ నిత్యం వెళ్తుంటాయి. కరీంనగర్ నుంచి జమ్మికుంట వైపు తిరిగే మూలమలుపు వద్ద గతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. డ్రైవర్ ఆదమరిస్తే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొనాల్సిందే. జమ్మికుంట వైపు వెళ్లే ప్రయాణికులు నిలబడడానికి అక్కడ స్థలం లేదు. ప్రయాణికులు వేరే స్థలంలో ఉండి బస్సు వచ్చే సమయంలో పరుగులు తీసి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ప్రమాదం జరగకుండా జాలి ఏర్పాటు చేయలేదు. ఇరుకు స్థలం ఉండడంతో అనేక ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడ్డారు. వాహనాల తాకిడి పెరగడమే కాకుండా మహలక్ష్మి పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి ప్రతీ బస్సులో సుమారు 120 మందికి పైగా ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు.



మూల మలుపు వద్ద ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మహిళను బెదిరించిన సంఘటనలో .. వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా స్థలం లో ప్రవేశించడంతో పాటు ఇంటి నిర్మాణం చేయకూడదని మహిళలను బెదిరించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన వ్యక్తి చెరుకూరి రాజేశంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి శనివారం పేర్కొన్నారు.

గ్రామంలోని మహిళ చెరుకూరి మంజుల గ్రామ శివారులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట తనకున్న స్థలంలో గ్రామ పంచాయతీ అనుమతిలో ఇంటి నిర్మాణం చేపట్టిందని తెలిపారు. పాత కక్షలను మనసులో పెట్టుకున్న రాజేశం ఈ నెల 3న పనుల వద్దకు చేరుకున్నారని చెప్పారు. నిర్మాణం చేయకూడదని పేర్కొంటూ అసభ్యపదజాలంతో దూషించడంతో పాటు చంపుతానని మహిళ మంజులను బెదిరించాడని పేర్కొన్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు రాజేశంపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

చెరువుల మరమ్మతులకు ఎదురుచూపులు

- సాగు నీటి సంఘాలు లేక నిర్వాహణ కరువు
- ఏటా వృథాగా పోతున్న సాగు నీరు





ధ్వంసమైన తక్కళ్లపల్లి పాడి చెరువు మత్తడి, గండి పడ్డ దుంపెట ఊర చెరువు

కథలాపూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏటా కురుస్తున్న భారీ వర్షాలకు చిన్న నీటి వనరులు ధ్వంసం కావడం వల్ల సాగు నీరంతా వృధాగా పోతోంది. ఏటేటా మరమ్మతులు చేస్తే చెరువులు, కుంటల్లో నీరు నిల్వ ఉండి భూగర్భ జలాలు పెరగడంతో పాటు పంటలు పండడానికి ఆస్కారం ఉంటుంది. ఇరిగేషన్ అధికారులకు చెరువులు, కుంటలు తెగిన సందర్భాల్లో రైతులు సమాచారం ఇస్తున్నప్పటికీ పరిశీలించి వెళ్లడం పరిపాటిగా మారుతోంది. ధ్వంసమైన వాటిని మరమ్మతులు చేయాలని పలుమార్లు కోరుతున్నా నిధులకు మాత్రం మోక్షం లభించడం లేదనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులపై పర్యవేక్షణ కోసం సాగు నీటి సంఘాలు ఏర్పాటు చేశారు. అప్పుడు పకడ్బందీగా చిన్న నీటి వనరులుతో పాటు మధ్యతరహా ప్రాజెక్టుల నిర్వాహణ ఆ సంఘాలే చేస్తుండేవి. తెలంగాణ ఏర్పడ్డాక బీఆర్‌ఎస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టాక సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో వాటి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. చెరువుల, కుంటలు, ప్రాజెక్టుల కింద ఆయకట్టు ఉన్న రైతులతో సంఘం ఏర్పాటు చేసి చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకునేవారు. మరమ్మతులకు నిధులు మంజూరు చేయించుకుని తీర్మానం చేసుకున్నాక సదరు పనులు పూర్తి చేసుకునేది.

● మరమ్మతులకు నిధులు కరువు..

మండలంలో 16 చెరువుల కింద 7,687 ఎకరాలు, 58 కుంటల కింద 1,630 ఎకరాల ఆయకట్టు ఉంది. బొమ్మెన ప్రాజెక్ట్, గంభీర్‌పూర్ తాళ్ల చెరువు ప్రాజెక్ట్, రాళ్లవాగు ప్రాజెక్ట్, సూరమ్మ చెరువు ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రతీ ఏటా ఏదో ఒకచోట చెరువులకు గండి పడడం, మత్తడి చెడిపోవడం, కట్టలపై ఏపుగా చెట్లుపెరగడం, తూములు లీకేజీలు వంటి సమస్యలు ఏర్పడుతుంటాయి. వీటి మరమ్మతుల కోసం నిధులు రాక ఏటా ఎదురుచూపులు తప్పడం లేదని ఆయకట్టుదారులు వాపోతున్నారు. రెండేళ్ల కిందట బొమ్మెన ప్రాజెక్ట్ కాలువల ఆధునికీకరణ, కట్టపై పొదల తొలగింపు, తూముల మరమ్మతుల కోసం ఐదు కోట్ల రూపాయలతో అంచనాలు తయారు చేసి నివేదికలు పంపిణీ నేటికీ నిధులకు మోక్షం లభించ లేదు. తుర్తి తీగలకుంట కట్టకు 3.16 లక్షల రూపాయలు, తక్కళ్లపల్లి కర్రోనికుంట కట్ట, మత్తడికి 13.52 లక్షల రూపాయలు, చింతకుంట వెంకటాద్రి కుంట మత్తడికి 5.92 లక్షల రూపాయలు, అంబారిపేట ఎర్రకుంట మత్తడికి 52 వేల రూపాయలు, సిరికొండ మల్లమ్మకుంట తూము, గైడ్‌వాల్ నిర్మాణాలకు 1.12 లక్షల రూపాయలతో ఇరిగేషన్ అధికారులు అంచనాలు వేసి అప్పటి ప్రభుత్వానికి పంపించారు. సాగునీటి సంఘాలు ఉంటే వాటిపై నిరంతరం పర్యవేక్షించి నిధుల కోసం ఎమ్మెల్యే, ఎంపీల వెంటబడి రాబట్టుకునేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల మరమ్మతులు సత్వరమే జరిగి నీరు వృధా పోకుండా నిల్వ చేసుకోడానికి వీలు కలుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● సాగునీటి సంఘాలు ఏర్పాటు చేయాలి

వాకిటి రాజరెడ్డి, సాగునీటి సంఘం మాజీ చైర్మన్, భూషణరావుపేట



సాగునీటి సంఘాలను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలి. చెరువు కట్టలపై చెట్లు, పొదలు పెరగడంతో పాటు మత్తడి, తూములు, కాలువలు ఏటా ధ్వంసం అవుతున్నాయి. సాగునీటి సంఘాలు ఉన్నట్లైతే వెనువెంటనే మరమ్మతులు చేసుకోడానికి ముందుకు వస్తాయి. నిధుల వినియోగం కూడా పకడ్బందీగా జరుగుతుంది. ఏ చిన్న సమస్య ఏర్పడ్డా సత్వరమే పూర్తి చేసుకుని నీటి వృథాను అరికట్టుకోవచ్చు. మరమ్మతుల కోసం నిధులు కూడా అధికంగా తెచ్చుకోడానికి వీలు కలుగుంది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలి

- బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్

గణేశ్‌నగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీలు సత్తా చాటాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఎన్నం ప్రకాష్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని మంకమ్మతోటలో బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బీసీ సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీలక తీతంగా బీసీలందరూ ఐక్యంగా ఉండి బీసీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన వాగ్దానం నిలుపుకొని, 42 శాతం జీవో అమలు కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలని, ఒకవేళ జీవో అమలు కాకపోతే, రాజకీయ పార్టీల ప్రకారంగా బీసీ రిజర్వేషన్లు అంటూ కాంగ్రెస్ మాయ మాటలు చెప్పే ప్రమాదం కూడా ఉందని దీనిని అన్ని రాజకీయ పార్టీల బీసీల నాయకులు గమనించాలని కోరారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ ఇదే ఎజెండాతో వస్తే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్ రాకుండా చేస్తామన్నారు. కోర్టులో జీవో అమలు కోసం కాంగ్రెస్ ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. జనరల్ స్థానాలలో కూడా బీసీల సత్తా చాటాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు సంపత్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, రాచమల్ల రాజు,సురేందర్, బండారు మల్లయ్య, నల్లవెల్లి రవి, మదాసు సంజీవ్, నారోజు రాకేష్ చారి తదితరులు పాల్గొన్నారు.





కోడ్ కూసింది

- నగదు, బంగారం తరలింపుపై ఆంక్షలు
- రూ. 50 వేలకు మించి తరలిస్తే ఆధారాలు చూపాల్సిందే..
- రూ. 10 లక్షల దొరికితే ఐటీకి అప్పగింత
- పోలీసుల తనిఖీలు ముమ్మరం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేయడంతో తక్షణమే కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో అంతర్ జిల్లా ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం తనిఖీల సమయంలో ఒక వ్యక్తి వద్ద 50 వేలకు మించి నగదు లభిస్తే ఆ డబ్బులకు తగిన ఆధారాలు చూపాల్సి ఉంటుంది. లేదంటే ఆ డబ్బులను సీజ్ చేస్తారు. ముఖ్యంగా నగదు, బంగారం ఇతర వస్తువుల తరలింపుపైనా ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. పోలీసులు, ప్రత్యేక టీంల తనిఖీల్లో సాధారణ ప్రజలు నగదు, బంగారం, వెండికి సంబంధించి సరైన పత్రాలు చూపించకుంటే వాటిని సీజ్ చేస్తారు. పట్టుకున్న డబ్బులపై ఎలాంటి ఆక్షేపణలు లేకపోతే, వారం రోజుల్లో ఆధారాలు చూపిస్తేనే వాటిని తిరిగి ఇచ్చే అవకాశం ఉంటుంది.

● ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుల ఏర్పాటు

జిల్లాలో ఆరు చోట్ల ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల అధికారులు, పోలీసులు, టాస్క్‌ఫోర్స్, సర్వలైన్‌టీం సిబ్బంది తనిఖీలు చేస్తుంటారు. ఈ క్రమంలో స్థానికంగా, ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే వారు ఎటువంటి సమస్యలు ఎదుర్కోకుండా ఉండాలంటే తీసుకెళ్తున్న నగదు, బంగారం, వెండికి సంబంధించిన తగిన ఆధారాలు, ధ్రువపత్రాలను వెంటే ఉంచుకోవడం ఉత్తమం.

● సమావేశాలకు అనుమతి తప్పనిసరి

రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎక్కడైనా సమావేశాలు నిర్వహించాలంటే ముందుగానే స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలి. సమావేశం ఎప్పుడు నిర్వహిస్తున్నాం, ఎక్కడ నిర్వహిస్తున్నాం వంటి వివరాలన్నీ ముందుగా తెలియజేస్తే పోలీస్ వ్యవస్థ అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తుంది. సమావేశంలో లౌడ్ స్పీకర్లు వాడాలనుకుంటే అధికారుల నుంచి ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహిస్తే దానికి సంబంధించిన సమాచారం ముందుగానే పోలీసులకు ఇవ్వాల్సి ఉంటుంది. ర్యాలీ ఎక్కడ మొదలవుతుంది, ఏ మార్గంలో వెళ్తుంది, ఎన్నింటికి మొదలవుతుంది, ఎన్నింటికి, ఎక్కడ ముగుస్తుందన్న విషయాలు స్పష్టంగా తెలియజేయాలి. ర్యాలీ నిర్వహించే సమయంలో మార్గం మార్చడం వంటివి చేయరాదు. ర్యాలీ సాగే మార్గంలో అప్పటికే ఏవైనా నిషేధాజ్ఞలు ఉంటే నిర్వాహకులు దాన్ని పాటించాల్సి ఉంటుంది. ఒకే ప్రాంతంలో, ఒకే సమయంలో వేర్వేరు పార్టీలు కానీ వేర్వేరు అభ్యర్థులు కానీ ర్యాలీలు నిర్వహించాలనుకుంటే రెండు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇందుకు తగిన సర్దుబాటు కోసం అవసరమైతే స్థానిక పోలీసుల సహకారం తీసుకోవాలి. ర్యాలీలు, సభలు, సమావేశాల వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి, అందుకు అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలి. ఇతర పార్టీల నాయకులు, అభ్యర్థులను పోలిన దిష్టిబొమ్మలను తీసుకెళ్లడం, అలాంటివి తగలబెట్టడం నిషేధం.

● తీసుకోవాల్సిన జాగ్రత్తలు

సాధారణ ప్రజలు నగదుతో ప్రయాణించే సమయంలో ఎన్నికల నిబంధనలను పాటిస్తూ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి సమస్య ఉత్పన్నం కాదు. విద్యాసంస్థలో ఫీజు చెల్లించడం, ఆసుపత్రుల్లో బిల్లు చెల్లించడం, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు, వ్యాపారులు, ఇతరత్రా అవసరాలకు అధిక మొత్తంగా నగదు తీసుకెళ్తున్న వారు తగిన ఆధారాలు బ్యాంక్ పాస్‌బుక్, విత్‌డ్రా రశీదు, ఇతర బిల్లులు వెంట తీసుకువెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. అవసరాల కోసం బ్యాంకు ఖాతా నుంచి నగదు విత్‌డ్రా చేసిన సమయంలో సంబంధిత ఖాతా పాస్ బుక్, ఏటీఎం రశీదులు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలి. ఆసుపత్రులకు డబ్బులతో వెళుతున్నవారు పేషెంట్ రిపోర్టులు, ఆసుపత్రి రశీదులు, ఇతర డాక్యుమెంట్లు తమ వెంట ఉంచుకోవాలి. వ్యాపారులు, రైతులు వస్తువులు, ధాన్యం, భూముల విక్రయంకు సంబంధించిన డబ్బు అయితే సంబంధించిన బిల్లులు, ల్యాండ్ డాక్యుమెంట్లు వెంట ఉంచుకోవాలి. బంగారం, ఆభరణాలు కొనుగోలు సమయంలో రశీదులు వెంట ఉంచుకోవాలి. వ్యాపారం, ఇతర సేవల కోసం డబ్బు వినియోగిస్తే తనిఖీల సమయంలో లావాదేవీల వివరాలను ఆధారాలతో అధికారులకు చూపించాలి. వ్యక్తుల శరీరంపై ఉన్న ఆభరణాలకు ఎలాంటి ఆంక్షలు ఉండవు. 10 లక్షలపైగా నగదు లభ్యమైతే ఐటీ, జీఎస్టీ అధికారులు కూడా రంగంలోకి దిగుతారు. వాటికి సంబంధించి కచ్చితమైన ఆధారాలు చూపిస్తేనే తిరిగి ఆ డబ్బులు ఇస్తారు. తనిఖీల్లో పట్టుకున్న నగదు, బంగారం, వెండి, ఇతర వస్తువులన్నింటిని జిల్లా ట్రెజరీలో భద్రపరుస్తారు. స్క్రీనింగ్ కమిటీ, ఆదాయపన్నుశాఖ అధికారులు రిలీజింగ్ ఆర్డర్ ఇస్తేనే ఆ డబ్బులు, వస్తువులు అప్పగిస్తారు.

రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

- రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన(రిటైర్డ్) ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(రేవా) ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా విశ్రాంత ఉపాధ్యాయ సంఘం భవనంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ మల్లారపు పురుషోత్తం అధ్యక్షతన జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల బెన్‌ఫిట్స్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న రేవా ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. తలపెట్టామన్నారు. ఏడదిన్నర కాలంలో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్కాష్మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యూటీ అందలేదని విమర్శించారు. ఉద్యోగ విరమణ చేశాక వెంటనే రావల్సిన బకాయిలు అందించక పోవడంతో పెన్షనర్లు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇలాంటి పరిస్థితులు ఉండేవి కావని ఈ విషయంపై ప్రభుత్వానికి రేవా ఆధ్వర్యంలో విన్నవించుకున్నా పెడచెవిన పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించేవరకు పోరాటాలు చేయాలని అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు కూడా సిద్ధం కావాలన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు జిల్లా సంఘం సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రేవా ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షుడు గద్దె జగదీశ్వర చారి, కోశాధికారి కనపర్తి దివాకర్, జిల్లా కమిటి సభ్యులుదేవనపెల్లి పరమేష్, ధర్మయ్య, అంజయ్య, మద్దికుంట లక్ష్మన్, తిరపతి, వెంకటేశ్వర్లు, దేవయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనానికి క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. పరివార దేవతాలయాల్లో కుంకుమ పూజలో పాల్గొని తరించారు.

కొండగట్టులో..



కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తులు

మల్యాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజన్న సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది.

ధర్మపురి క్షేత్రంలో..

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. స్థానిక లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఉగ్ర నరసింహ, వేంకటేశ్వర, రామలింగేశ్వర స్వామి, గణపతి ఆలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. ఆలయాలకు చేరుకుని అభిషేకం, అర్చన, హోమం, నిత్య కళ్యాణం టిక్కెట్లు కొనుగోలు చేసి పూజలు చేయించారు. భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయం పక్షాన ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, సంతోష్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ, చంద్రప్రభ వాహనంపై శ్రీవారి ఊరేగింపు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా సాగుతున్నాయి. శనివారం శ్రీవారు సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై పట్టణ పురవీధుల గుండా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం దేవాలయంలో పూజారులు లక్ష్మీవేంకటేశ్వర స్వామికి ఆరాధన, సేవాకాలం, బాలభోగం, నివేదన నిర్వహించి తీర్థప్రసాదాలను భక్తులకు వితరణ చేశారు. అనంతరం పురవీధుల గుండా శ్రీవారు సూర్యప్రభ వాహనంపై రంగనాయక తిరుప్పోలం అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

సాయంత్రం దేవాలయంలో సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం జరిగింది. అనంతరం శ్రీవారిని చంద్రప్రభ వాహనంపై పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించగా మహిళలు మంగళ హారతులతో స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవాలయం కార్యనిర్వాహణాధికారి మారుతిరావు, దేవాలయం మాజీ చైర్మన్లు, సిబ్బంది, అర్చకులు, భక్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సూర్యప్రభ వాహనంపై దర్శనం ఇస్తున్న శ్రీవారు

ఘనంగా దీప యజ్ఞం.. సుహాసినిల కలశ యాత్ర

తంగళ్లపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులోని శ్రీ గాయత్రి పరివార ఆశ్రమం అధ్వర్యంలో నిర్వహిస్తున్న దీప యజ్ఞం కార్యక్రమంలో భాగంగా శనివారం తంగళ్లపల్లి గ్రామంలో సుహసినిల చేత కలశ యాత్ర ఘనంగా నిర్వహించారు. మార్కండేయ ఆలయం నుంచి గ్రామ పుర వీధుల్లో కలశ యాత్ర కొనసాగింది. అనంతరం గాయత్రి ఆశ్రమంలో సామూహిక దీపాలు వెలిగించి దీప యజ్ఞం చేశారు. అలాగే ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు నవరాత్రి పూర్ణాహుతి, 24 కుండీల గాయత్రి గీతా మహా యజ్ఞ పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గాయత్రి ఆశ్రమ నిర్వహకులు బాదం ప్రకాశ్-గిరిజా దంపతులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు గజభీంకర్ రాజన్న, రాపెల్లి ఆనందం, యాదగిరి, శంకర్, మధు తదితరులు పాల్గొన్నారు.



కలశ యాత్రలో పాల్గొన్న మహిళలు

ప్రయాణికుల రద్దీని పరిశీలించిన జోన్ ఈడీ



రద్దీని పరిశీలిస్తున్న అధికారులు

భగత్‌నగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ వగిడి మర్రి సోలమన్, ఆర్ఎం బిరాజు పరిశీలించారు. కరీంనగర్ బస్‌స్టేషన్‌లో బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీని పర్యవేక్షించారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బస్సులను అందుబాటులో ఉంచాలని కరీంనగర్ బస్‌స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఎల్ మల్లేశంనకు సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్ డిప్యూటీ మేనేజర్ ఎస్ భూపతిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ నుంచి 25,000 క్యూసెక్కులు దిగువకు..

జగిత్యాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరద నీరు రావడం శనివారం కొనసాగిందది. 9 గేట్లు పైకి ఎత్తి 25,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 60,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మారనున్న రాజన్న ఆలయ ముఖచిత్రం

- శరవేగంగా విస్తరణ పనులు - భీమన్న ఆలయంలో దర్శనాలకు ఏర్పాట్లు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయ ముఖచిత్రం త్వరలో మారనుంది. దీంతో పట్టణ ప్రజలు, భక్తుల ఎన్నేళ్ల కల సాకారం కానుంది. మూడు దశల్లో 35 ఎకరాల్లో 2027 సంవత్సరం వరకు సర్వాంగసుందరంగా, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. స్థానిక శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూ.150 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ నిర్వహించారు. మొదటి దశ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మూలవాగు బ్రిడ్జి సమీపం నుంచి రాజన్న ఆలయం వరకు 80పీట్ల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇళ్ల కూల్చివేతలు పూర్తయ్యాయి.

● తాత్కాలిక దర్శనాలకు..

రాజన్న ప్రధాన ఆలయంలో భక్తులకు దర్శనాలను నిలిపివేసి స్థానిక భీమేశ్వరస్వామి ఆలయంలో తాత్కాలికంగా భక్తులకు దర్శనాలు కల్పించేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయి. పలురకాల మొ క్కులకు సంబంధించిన షెడ్ల నిర్మాణాలు వేగంగా జ రుగుతున్నాయి. ప్రసాదాల తయారీ గోదాంను వేద పాఠశాలలోకి, వేదపాఠశాలను భగవంతరావునగర్‌లోని శివ స్వాముల భవనంలోకి మార్చుతున్నారు. ప్రధాన గోదాంను భీమేశ్వర సదన్‌లోని క్యాంటీన్‌లోకి మార్చనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రధానకార్యాలయం, పీఆర్వో, ఈవో, ఇంజనీరింగ్ విభాగాలను భీమేశ్వర సదన్‌లోని మొదటి అంతస్తు, విచారణ కార్యాలయంలోకి మార్చనున్నట్లు ఈవో రమాదేవి తెలిపారు.





రాజన్న ఆలయంలో కొనసాగుతున్న కూల్చివేత పనులు, భీమేశ్వర ఆలయంలో కోడెమొక్కులకు ధ్వజస్తంభం ప్రతిష్ఠిస్తున్న అర్చకులు

చరిత్రలో నిలిచేలా ఆలయ అభివృద్ధి..



- ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్

చరిత్రలో నిలిచిపోయేలా రాజన్న ఆలయ అభివృద్ధిని సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేయబోతున్నాం. శృంగేరీ పీఠాధిపతుల సలహాలు, సూచనల మేరకు ఆలయ విస్తరణ పనులు సాగుతున్నాయి. గత ప్రభుత్వం రాజన్న ఆలయాన్ని పట్టించుకోలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాజన్న ఆలయ అభివృద్ధిపై దృష్టిసారించింది.

వేగంగా పనులు జరుగుతున్నాయి..



- రమాదేవి, రాజన్న ఆలయ ఈవో

రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆలయంలోని కళాభవన్, ఎస్డీఆర్ గెస్టహౌస్‌తో పాటుగా ఈవో కార్యాల యం కూల్చివేశాం. భీమేశ్వర ఆలయంలో పనులు వేగంగా జరుగుతున్నాయి. పూర్తయిన వెంటనే దర్శనాలను భీమన్న ఆలయంలోకి మారుస్తాం.

ముగిసిన శరన్నవరాత్రోత్సవాలు



ఇల్లందకుంటలో ప్రత్యేక పూజలు చేస్తున్న సిబ్బంది

ఇల్లందకుంట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీతా రామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామ శరన్నవరాత్రోత్సవాలు శనివారం నిత్య కల్యాణంతో ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు, ధర్మకర్తలు కిరణ్, రాంరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మల్లారెడ్డి, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వ్యక్తులపై కేసు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఓ ఉన్నతాధికారి షూ ధరించి జాతీయ జెండా ఆవిష్కరణ చేశారంటూ సోషల్‌మీడియాలో పోస్టు చేయడంపై ఫిర్యాదు చేయడంతో పలువురు వ్యక్తులపై కేసు నమోదైంది. ఈ కేసులో సోషల్‌మీడియాలో పోస్టు చేసిన పలువురిని శనివారం అరెస్టుచేసి 41ఏ కింద నోటీస్ ఇచ్చి విడుదల చేశారు.

మద్యం షాపునకు ఒక దరఖాస్తు

జిల్లాలో మద్యం షాపు టెండర్లలో భాగంగా శనివారం ఒకే ఒక్క దరఖాస్తు దాఖలైంది. తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్ల వైన్‌షాప్‌నకు ఓ వ్యాపారి దరఖాస్తు చేశాడు. ఇప్పటివరకు 49 దరఖాస్తులు దాఖలయ్యాయని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

చెరువులకు జలకళ

- మత్తడి దూకుతున్న సాగునీటి వనరులు

ఎల్లారెడ్డిపేట. అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, అక్కపల్లి, సింగారం, బండలింగంపల్లి, కోరుట్లపేట తదితర గ్రామాల శివారులో ఉన్న సాగు నీటి వనరులు మత్తడి దూకుతున్నాయి. భూగర్భ జలాలు పెరగడంతో బోరు బావుల నుంచి కూడా సాగు చేసుకోవచ్చని రైతులు పేర్కొంటున్నారు.

● ఆయకట్టు భూముల అందనున్న సాగు నీరు

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, అక్కపల్లి, సింగారం, బండలింగంపల్లి, కోరుట్లపేట తదితర గ్రామాల్లోని గిద్దె చెరువు, జక్కుల చెరువు, గాలం చెరువు, పద్మావతి చెరువు, మైసమ్మ చెరువు, గుండ్ల చెరువు, చౌడమ్మ చెరువులు నిండు కుండలా మారాయి. చెరువుల కింద సుమారు 8 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయకట్టు భూములున్నాయి. సాగు నీటి వనరుల్లో నీరు పుష్కలంగా ఉండడంతో ఆయకట్టు భూముల సాగుకు నీరు అందే అవకాశాలున్నాయి. వాన కాలం పంట కోత దశకు చేరుకోవడం వల్ల యాసంగి పంట సాగుపై అన్నదాతలకు సాగు నీటి బెంగ లేకుండా పోయింది. చెరువుల్లో నీరు ఉండడంతో తమ భూములను సాగు చేసుకోవచ్చని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. ఆయకట్టు కాల్వల ద్వారా సాగు నీటి విడుదల చేయడంపై సంబంధిత శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వరి పంటకు సాగు నీరు అందించేలా చర్యలు చేపడుతున్నారు. యాసంగి పంట సాగుకు నీటి కొదవ ఉండదని అన్నదాతలు పేర్కొంటున్నారు.



నిండుకుండలా జక్కుల చెరువు..

జడ్పీటీసీ ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

తంగళ్లపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ టికెటు కోసం ఆశావహులు ఉత్సాహంగా పేర్ల నమోదు చేసుకున్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ స్థానిక ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ, 14 ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జడ్పీటీసీ స్థానానికి 9మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే తంగళ్లపల్లి 2 స్థానానికి 11 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

ఫ్లెక్సీల ఏర్పాటుపై ఫిర్యాదు

రుద్రంగి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా రుద్రంగి మండల కేంద్రంలో బతుకమ్మ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై బీజేపీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉండగా కాంగ్రెస్ జెండాలు ఏ విధంగా ఏర్పాటు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కర్నవత్తుల వేణు, బాలకిషన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం లాల్ సింగ్‌తండాలోని లబ్ధిదారుడు భూక్య బన్నాజీకి మంజూరైన రూ.25వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం పంపిణీ చేశారు. ఆపదలో మెరుగైన వైద్యం అందించేందుకు సీఎంఆర్ఎఫ్ వరంలాంటిదని పేర్కొన్నారు. మంజూరుకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, గజన్‌లాల్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

వేలంపాట..

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని ఓమౌజయః ప్రజ్ఞాన కేంద్రంలో మహాదేవీ ఆధిపత్య చక్రం వేలం పాటను శనివారం నిర్వహించారు. 108(ఐదు రూపాయాల నాణేలు) వేలం పాటకు రూ.540 నిర్వహించగా భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన గోపాలకృష్ణంరాజు రూ.3,33,333లకు దక్కించుకున్నారని ఓ మౌజయః ప్రజ్ఞాన కేంద్రం ప్రతినిధి సిద్ధా పేర్కొన్నారు. మహాదేవీ ఆధిపత్యం చక్రం దక్కించుకున్న వారికి అన్ని మంచి ఫలితాలు కల్గుతాయని వివరించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దుర్గామాత నిమజ్జన వేడుకలు..

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో దుర్గామాత నిమజ్జన వేడుకలు శనివారం కొనసాగాయి. ఆయా యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో గ్రామ పురవీధుల గుండా శోభయాత్ర నిర్వహించారు. యువతీయువకులు, మహిళలు, చిన్నారులు కోలాటలు, దాండియా, నృత్యాలు చేశారు. భక్తిశ్రద్ధల నడుమ దుర్గామాత ముందుకు సాగారు. మహిళలు మంగళహారతులు సమర్పించారు. అనంతరం నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు. ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

లడ్డూ డ్రా..

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా వీర్నపల్లి మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన దుర్గామాత మండపంలో శనివారం రాత్రి లడ్డూ కోసం డ్రా నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన ముస్లిం హైమద్ హుస్సేన్ డ్రాలో పాల్గొని లడ్డూను గెలుచుకున్నాడు. ఉత్సవ కమిటీ సభ్యులు లడ్డూ అందించి సన్మానించారు.

సత్తా చాటేందుకు కృషి..

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ వార్డు సభ్యుడి నుంచి జడ్పీటీసీ వరకు అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు పాటు పడాలన్నారు. మండలంలోని మొత్తం 13 ఎంపీటీసీ స్థానాలుండగా ఒక్కో స్థానానికి ముగ్గురు పేర్లను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కేకే మహేందర్‌రెడ్డికి పంపిస్తామని పేర్కొన్నారు. పార్టీ టికెటు కేటాయించిన అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు రాజేందర్, తిరుపతిరెడ్డి, గణపతి, లక్ష్మారెడ్డి, గిరిధర్‌రెడ్డి, బాబు, శ్రీనివాస్, కిషన్, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, దేవేందర్, మహేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాలతో పాటు రాచర్లగొల్లపల్లి, కంచర్ల గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన, వివిధ ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొందుతున్న పలువురు కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావులు వేర్వేరుగా శనివారం పరామర్శించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో పురుషోత్తం తల్లి మృతిచెందగా ఆయన కుటుంబాన్ని తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, రాచర్లగొల్లపల్లిలో గుర్రాల ప్రతాప్‌రెడ్డి చనిపోవడంతో బాధిత కుటుంబాన్ని ప్యాక్స్ చైర్మన్, రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డిలు ఓదార్చారు. వీర్నపల్లి మండల కేంద్రంలో మృతి చెందిన షేక్ అలీ, కంచర్లలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయ పడిన తాజా, మాజీ సర్పంచ్ పిట్టల రజిత భర్త లింబాద్రి, బహ్రెయిన్ దేశంలో గుండెపోటుతో మృతి చెందిన దేవోళ్ల హన్మంతు, స్థానిక దినసరి కూలీ దండుగుల చిన్నలస్మయ్య చనిపోవడంతో ఆ కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య పరామర్శించారు. సెస్ డైరెక్టర్ మల్లేశం, నాయకులు రాజిరెడ్డి, చాంద్ పాషా, సురేశ్‌నాయక్, రవి, ఎల్లయ్య, దేవరాజు, రమేశ్, రాజు, దేవరెడ్డి, సత్యారెడ్డి, రాజిరెడ్డి, మురళీమోహన్, రాజం తదితరులు ఉన్నారు.

శ్రీనివాస్ మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటు



నివాళులర్పిస్తున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీలో చురుకైన కార్యకర్త వేములవాడ శ్రీనివాస్ మృతి తీరనిలోటని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందగా శనివారం శ్రీనివాస్ మృతదేహం వద్ద జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో కలిసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీని తన ప్రాణంగా భావించే కార్యకర్త శ్రీనివాస్ అని, శ్రీనివాస్ మృతి తీవ్రంగా కలచివేసిందన్నారు. వారి వెంట రామతీర్థపు రాజు, నీలం శేఖర్, వాసాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూసం రమేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రం బీవైనగర్ అమృతలాల్ శుక్ల కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో రమేష్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం నుంచి జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లో వీలైనంత వరకు ఎక్కువ మంది అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. జిల్లాలో సీపీఎం కార్మిక, కర్షకులు, బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడుతూ అనేక పోరాటాలు చేస్తోందన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తమ స్వార్థ రాజకీయాల ప్రయోజనాల కోసం మాత్రమే పనిచేస్తున్నాయని ప్రజల సమస్యలను పరిష్కరించడం లేవని ఆరోపించారు. ఎన్నికల ముందు అనేక హామీలనిస్తూ ఎన్నికలైన తరువాత హామీలను తుంగలో తొక్కేయడం పెట్టుబడిదారి పార్టీలకు ఆనవాయితీగా మారిందన్నారు. చట్టసభలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం తగ్గడంతో విచ్చలవిడిగా అవినీతి రాజ్యమేలుతోందన్నారు. గతంలో జిల్లాలో భూఅక్రమాలు, ఇసుక మాఫియా, ప్రకృతి సంపద దోపిడీకి గురైనాయని ఆరోపించారు. ప్రశ్నించే గొంతులకు లేకపోవడంతో రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతుందని ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. నీతికి నిజాయితీకి క్రమశిక్షణకు మారుపేరైన సీపీఎం పార్టీ అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు గెలిపించాలన్నారు. సమావేశంలో సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, జిల్లా కమిటీ సభ్యులు సూరం పద్మ, శ్రీరాముల రమేష్‌చంద్ర, సందుపట్ల పోచమ్మల్లు, గడ్డం రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాషాయ జెండాను ఎగుర వేయాలి



సమావేశంలో మాట్లడుతున్న దుమాల శ్రీకాంత్

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి కాషాయ జెండాను ఎగుర వేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు లక్‌పతినాయక్‌లు అన్నారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లో శనివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి, లక్‌పతినాయక్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను వంచిస్తున్న తీరును ఎండగట్టాలని అన్నారు. గడపగడపకు వెళ్లి పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి కార్యకర్త పాటు పడాలని అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సహకారంతో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని అన్ని ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను దక్కించుకునేందుకు శ్రమించాలని అన్నారు. సమావేశంలో ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, గణేశ్, బాలయ్య, రంజిత్‌కుమార్, ఆంజనేయులు, బాలకృష్ణ, రాజిరెడ్డి, రవీందర్‌నాయక్, ప్రదీప్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, వేణు, నర్సయ్య, నాగరాజు, పీర్యానాయక్, లింబాద్రి, ప్రకాశ్, వెంకటేశ్, రాజు, శ్రీనివాస్, ప్రవీణ్, తిరుపతి, శేఖర్, మహేశ్, రమేశ్, దేవేందర్‌రెడ్డి, రవి, దర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండల పరిషత్ కార్యాలయంపై స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయం జెండా ఎగురవేయాలని రాష్ట్ర బీజేపి కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేష్ అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జడ్పిటిసితో పాటు ఎంపీటీసీల గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రధాని నరేంద్రమోడీ కేంద్ర ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధి పనులను ప్రజలలో తీసుకువెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి ఇంచార్జ్ రేగుల మల్లికార్జున్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు మార్త సత్తయ్య, నాయకులు మర్రి మల్లేశం,పెరిక గంగరాజు, పోంచెట్టి రాకేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : బీజేపీ వేములవాడ అర్బన్ మండల ముఖ్యకార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీజేపీ నుంచి అభ్యర్థులను బరిలో నిలపాలని సూచించారు. ఈ సమావేశంలో కుమ్మరి శంకర్, శేఖర్, జింక అనిల్, చింతపల్లి వెంకటేశ్వర్‌రావు, రేగుల పర్శరాములు, సంతోష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

● ఇల్లంతకుంట : రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ సత్తాచూపాలని జిల్లా నాయకులు గుజ్జ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకవెళ్లాలని సూచించారు. జడ్పీటీసీతో పాటు అత్యధిక స్థానాలలో ఎంపీటీసీలు, సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకోవడానికి ఇంటింటికి వెళ్లాలని సూచించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పరిపాలనల పట్ల ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో మండల శాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, నాయకులు మ్యాకల మల్లేశం, దేశెట్టి శ్రీనివాస్, బత్తిని సాయగౌడ్, మామిడి హరీష్, బత్తిని స్వామి, పినకాసి అనీల్, తుమ్మనపల్లి కమలాకర్‌రావులతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి :స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని ఇంచార్జీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు అధ్యక్షతన స్థానిక ఎన్నికలపై కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దుమాల శ్రీకాంత్ మాట్లడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని అన్నారు. పోటీ చేసే కార్యకర్తలు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. స్థానిక పోరులో కాశయ జెండా ఎగరడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు కోల అంజనేయులు, కొస్నీ వినయ్, రెడ్డిమల్ల ఆశీర్వాద్, పోకల శ్రీనివాస్, కాసుగంటి రాజు, ఇటికల మహేందర్, కొడం భవిత తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మంతోనే విశ్వ కల్యాణం..



మాట్లాడుతున్న సంఘచాలక్ శ్రీనివాసరెడ్డి

చందుర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : సనాతన ధర్మంతోనే విశ్వ కళ్యాణం దేశహితమే సంఘ లక్ష్యమని జగిత్యాల జిల్లా సంఘచాలక్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి అన్నారు. చందుర్తి మండలం మల్యాల గ్రామంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని, శనివారం విజయదశమి ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధాన వక్తగా జగిత్యాల జిల్లా సంఘచాలక్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దేశ ఉన్నతి కోసం ఎలాంటి స్వార్థం లేకుండా ఆర్ఎస్ఎస్ ఎంతో కృషి చేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్‌లో అందరు భాగస్వాములు కావాలన్నారు. భారతదేశ హిందూ దేశమని, హిందూ ధర్మాన్ని రక్షించుకోవాలన్నారు. ప్రపంచానికి జ్ఞానాన్ని అందించినది భారతదేశమని, అందుకే ఈ దేశాన్ని జ్ఞానభూమి అని కొన్ని లక్షల సంవత్సరాలుగా ప్రపంచానికి మార్గదర్శనం చేస్తూ విశ్వ గురువుగా ఉందన్నారు. భారతదేశం పుణ్యభూమి అని ఈ దేశంలో దేవతలు పుట్టి తిరిగారన్నారు. అందుకే రుగ్వేదంలో దుర్లభం భారతి జన్మ మానస తత్రదుర్లం అని,ఈ దేశంలో పుట్టడం మనం చేసుకున్న అదృష్టమన్నారు. స్వామి వివేకానంద విశ్వమత సభలో మాట్లాడిన తర్వాత ఈనేలపై నేరుగా పాదం మోపకుండా నేలపై పొర్లాడడం జరిగిందన్నారు. ఇలాంటి దేశం ఎందుకు బానిసత్వంలోకి వెళ్లిందని చరిత్రను పరిశోధించిన డాక్టర్ హెగ్డేవార్ ఈ దేశ ప్రజల మధ్య ఐక్యత, ఈ దేశం నాది అనే భావన లేని కారణంగానే ఈ స్థితిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు చెన్నమనేని అంజనేయ రావు, మల్యాల, కట్ట లింగంపేట, లింగంపేట గ్రామ స్వయంసేవకులు తదితరులు పాల్గొన్నారు

ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి సరఫరా చేయాలి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటి సరఫరా చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మున్సిపల్ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్‌లో చేపట్టిన పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. నగరంలో వివిధ గ్రాంట్లతో పనులు ప్రారంభించి పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభివృద్ధి పనులను ఇంజనీరింగ్ అధికారులు తప్పనిసరిగా పర్యవేక్షించాలని, పనులన్నీ టైమ్‌లైన్ ప్రకారం, టెండర్ అగ్రిమెంట్ ప్రకారం కాంట్రాక్టర్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. సమయం ప్రకారం ప్రతిరోజు నల్లానీటిని సరఫరా చేయాలని, నీటి సరఫరా సమయంలో ఇంజనీరింగ్ అధికారులు, లైన్‌మెన్లు, ఫిట్టర్లు పర్యవేక్షణ తప్పకుండా చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా లీకేజీలుంటే వెంటనే వాటికి మరమ్మతులు చేయాలని, నీరు కలుషితం కాకుండా చూడాలని అన్నారు. సమావేశంలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈలు సంజీవ్‌కుమార్, రొడ్డ యాదగిరి, డీఈ ఓంప్రకాశ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎల్ఎండీ రెండు గేట్లు ఎత్తివేత

తిమ్మాపూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖ అధికారులు ఎల్ఎండీ రెండు గేట్లు ఎత్తి నాలుగు వేల క్యూసెక్కుల నీటిని శనివారం రాత్రి దిగువకు విడుదల చేశారు. ఎల్ఎండీ ఇప్పటికే పూర్తి స్థాయిలో నిండి ఉంది. మిడ్ మానేరు నుంచి మూడు వేలు, మోయతుమ్మెద వాగు నుంచి వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో అంతేమొత్తంలో నీటిని స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.903 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

వరి కోతలు షురూ

- కొనుగోలు కేంద్రాల కోసం రైతుల ఎదురుచూపులు



వెంకటాపూర్ శివారులలో వరి కోస్తున్న యంత్రం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో ఆటుపోట్లను తట్టుకుంటూ వ్యవసాయం చేసిన అన్నదాతలు వరి కోతలకు శ్రీకారం చుట్టారు. దిగుబడి ఇంటికి చేరడంతో ఆశలు నెలకొన్నాయి. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, బండలింగంపల్లి, పదిర, హరిదాస్‌నగర్ తదితర గ్రామాల్లో సాగుచేసిన పంట చేతికందడంతో రైతులు కోతలు ఆరంభించారు. మండలంలో మొత్తం 17500 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను సాగుచేశారని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే 8వేల ఎకరాల పంట కోత దశకు చేరుకుందని చెబుతున్నారు. పలు గ్రామాల్లో రైతులు వరి కోతలను ప్రారంభించారని తెలిపారు. ధాన్యం చేతికందడంతో రైతులు ఆరబెడుతున్నారు. ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయడంలో ఆస్యలం జరుగుతుందని భావిస్తున్న అన్నదాతలు క్వింటాలుకు రూ.1700లకు వ్యాపారులకు విక్రయిస్తున్నామని కర్షకులు చెబుతున్నారు.చేతికి వచ్చిన ధాన్యం అకాల వర్షానికి తడిసిపోతోందని ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నామంటున్నారు. కొనుగోలుకేంద్రాల కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు.కాగా కోత యంత్రాల యజమానులు ధరలను ఇంకా నిర్ణయించలేరు. వారం రోజుల్లో కోతలు జోరందుకోనున్నాయి. గ్రామాల్లో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరను అందించాలని రైతులు కోరుతున్నారు.

మత్తు పదార్థాల అనర్థాలపై ప్రచారం చేయండి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలతో అనర్థాలపై విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రారంభించి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లాలో నిర్వహించవలసిన వివిధ కార్యక్రమాలపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అక్టోబరు నెలాఖరు వరకు జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల మహిళలను ఈ అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, మెడికల్ కళాశాలల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. మాదకద్రవ్య వ్యతిరేక సందేశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. మాదకద్రవ్య రహిత భారత్ గురించి యువతకు వివరించేలా డ్రాయింగ్ కాంపిటీషన్ ఏర్పాటుచేయాలని చెప్పారు. మారథాన్ నిర్వహించి మాదకద్రవ్యాల అనర్థాలపై ప్రజలకు సందేశం ఇవ్వాలని సూచించారు. సామూహిక ప్రతిజ్ఞ చేయించాలని, ప్రతిజ్ఞను సూచించే ఆన్‌లైన్ క్యూఆర్ కోడ్‌ను జనసందోహం ఉన్న ప్రాంతాల్లో ప్రదర్శించాలని సూచించారు. అనంతరం నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు.

కలిసికట్టుగా పనిచేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి అన్ని స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకోవాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఆగయ్య హాజరై మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ఎండగట్టాలని అన్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు అభ్యర్థుల విజయానికి పాటు పడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ఓట్ల రూపంలో రాబట్టేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆగయ్య అన్నారు. సమావేశంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ మల్లేశం, నాయకులు సురేశ్‌నాయక్, రవి, చాంద్‌పాషా, సాగర్, రఫీక్, హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను పరిశుభ్రంగా ఉంచాలి

తిమ్మాపూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది అటెండెన్స్, అవుట్ పేషెంట్స్ రిజిస్టర్లను, ఇతర రికార్డులను పరిశీలించారు. ఎన్‌సీడీ క్లినిక్‌లో అసంక్రమిత వ్యాధుల రికార్డులను పరిశీలించి అందులో అధిక రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాల నమోదును పరిశీలించారు. గర్భిణులకు మొదటి కాన్పులను సిజేరియన్ చేయించుకోవడం వల్ల కలిగే సమస్యలను వివరించాలని అన్నారు. సాధారణ ప్రసవాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగేటట్లుగా గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని టీవీని పనివేళల్లో ఆన్‌లో ఉంచాలని, ఆరోగ్య అవగాహనకు సంబంధించిన వివరాలను ప్రసారం చేయాలన్నారు.

ప్రభుత్వ విధి విధానాల ప్రకారం పని చేయాలి

- టీజీఎండీసీ ఎండీ భవేష్ మిశ్రా

తిమ్మాపూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకారం పని చేయాలని టీజీఎండీసీ ఎండీ, వీసీ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని కొత్తపల్లి సమీపంలోని ఎల్ఎండీ ప్రాజెక్టులో ఇసుక రీచ్‌ను, ఎల్ఎండీ ప్రాజెక్టు పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ పరంగా తీసుకున్న అనుమతుల ప్రకారమే పని చేయాలని పూడికతీస్తున్న ఎమోట్ డ్రెడ్జింగ్ ప్రయివేటు లిమిటెడ్ యాజమాన్యాన్ని ఆదేశించారు. పనులు వేగంగా కొనసాగించాలని, రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచుకోవడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఎల్ఎండీ తరహాలోనే మిడ్ మానేరు, కడెం ప్రాజెక్టుల్లో పూడికతీత పనులకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఎస్ఈ పెద్ది రమేష్, కరీంనగర్ మైనింగ్ ఏజీ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈ సదయ్య, టీజీఎండీసీ ప్రాజెక్టు ఆఫీసర్లు వినయ్‌కుమార్, రాజు, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.